ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 27 డిసెంబరు 2025 www.prajaswaramdailly.com 3 pm

# ఉప ఎన్నిక వస్తే నాదే విజయం

## దానం నాగేందర్



హైదరాబాద్, ప్రజాస్వరం
ఉపఎన్నిక వస్తే మళ్లీ గెలుస్తానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. రాజీనామా అంశం, ఉపఎన్నికల్లో పోటీ చేయడంపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిమాయత్‌నగర్ డివిజన్ కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు. రాజీనామా చేసి ఉపఎన్నికలకు వెళ్లేందుకు తనకు ధైర్యం ఉందని.. అది కార్యకర్తల ద్వారా వచ్చిందని చెప్పారు. కార్యకర్తల అండతోనే ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినట్లు చెప్పారు. ఉపఎన్నిక వస్తే మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సీఎం పదవికి గౌరవం ఇవ్వడం మరిచింది బీఆర్ఎస్ నేతలే అని విమర్శించారు. ముఖ్యమంత్రిని ఏకవచనంతో అగౌరవంగా మాట్లాడింది ఆ పార్టీ వాళ్లేనని మండిపడ్డారు. విమర్శలు చేస్తే.. ప్రతివిమర్శలూ ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# ఇక అలా మాట్లాడను : నటుడు శివాజీ




హైదరాబాద్, ప్రజాస్వరం
ఇకపై మహిళల విషయంలో చులకనగా మాట్లాడబోనని శివాజీ తెలిపారు. ఇటీవల దండోరా సినిమా ఈవెంట్ సందర్భంగా మహిళలపై శివాజీ అవమానకర వ్యాఖ్యలు చేశారని, అవి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయని గమనించినట్లు మహిళా కమిషన్ తెలిపింది. ఇకపై మహిళల విషయంలో జాగ్రత్తగా మాట్లాడాలని ఆయనకు మహిళా కమిషన్ సూచించింది.

# జీరామ్‌జీ.. దేశవ్యాప్త నిరసనలు?

**గ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు**

**సీడబ్ల్యూసీ సమావేశం**



న్యూఢిల్లీ ,ప్రజాస్వరం
న్యూఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం ప్రారంభమైంది . కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత శశిథరూర్‌తో సహా అనేకమంది హాజరయ్యారు. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలకు సంబంధించి వ్యూహాలు రూపొందించడం, ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలతో సహా పలు కీలక అంశాలపై ఇందులో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

సమావేశం ప్రారంభానికి ముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తొలి వర్ధంతి సందర్భంగా సీడబ్ల్యూసీ సభ్యులు నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ నేతలు శివరాజ్ పాటిల్, శ్రీ ప్రకాశ్ జైస్వాల్‌లకు సంతాపం తెలిపారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా ప్రజల మద్దతును సమీకరించేందుకు సిద్ధమైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలకు సంబంధించిన ప్రణాళికను ఖరారు చేసే అవకాశం ఉందని వెల్లడించాయి. సోనియా, రాహుల్‌పై మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న నేషనల్ హెరాల్డ్ కేసు గురించి, పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలపైనా చర్చించే అవకాశం ఉంది. బంగ్లాదేశ్‌లో హిందువులకు వ్యతిరేకంగా జరుగుతున్న దాడుల గురించి ఈ చర్చల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# మహిళా కమిషన్ కార్యాలయానికి శివాజీ

**విచారణకు హాజరు**

హైదరాబాద్, ప్రజాస్వరం
మహిళలపై అవమానకర వ్యాఖ్యల వ్యవహారంలో సినీ నటుడు శివాజీకి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే శివాజీ శనివారం నగరంలోని మహిళా కమిషన్ కార్యాలయానికి వెళ్లారు. మహిళలపై వ్యాఖ్యల అంశంలో వివరణ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల దండోరా సినిమా ఈవెంట్ సందర్భంగా మహిళలపై శివాజీ అవమానకర వ్యాఖ్యలు చేశారని, అవి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయని గమనించినట్లు మహిళా కమిషన్ తెలిపింది. ఈమేరకు సుమోటోగా విచారణ చేపట్టాలని నిర్ణయించి ఆయనకు నోటీసులు పంపింది. 27న వ్యక్తిగతంగా కమిషన్ ఎదుట విచారణకు హాజరు కావాలని ఆయన్ను ఆదేశించింది. ఈక్రమంలో శివాజీ నేడు కమిషన్ కార్యాలయానికి వెళ్లారు.

# చార్జిషీట్‌లో ఏ-11గా అల్లు అర్జున్

**సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు**

**హైదరాబాద్, ప్రజాస్వరం** సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. మొత్తం 23 మందిపై అభియోగాలు మోపారు. చార్జిషీట్‌లో ఏ-11గా సినీ నటుడు అల్లు అర్జున్ పేరు చేర్చారు. 2024 డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల సమయంలో పుష్ప-2 బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్దకు వచ్చిన చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జి చేయడంతో రేవతి(35) అనే మహిళ తోపాటు ఆమె కుమారుడు శ్రీతేజ(9) కింద పడిపోయి జనం కాళ్ల మధ్య నలిగిపోయారు. ఇద్దరూ తీవ్ర గాయాలతో స్పృహ తప్పారు. వెంటనే పోలీసులు వారిని పక్కకు తీసుకెళ్లి సీపీఆర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ తల్లి మృతిచెందారు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉండటంతో నిమ్స్‌కు తరలించారు.

# పురుషాధిక్య ఆలోచనలు



**అందులో నుంచి బయటికి రావాలి**

**ఫ్యాషన్ డ్రెస్‌లు ధరించడం తప్పు కాదు**

**శివాజీ వ్యాఖ్యలపై నాగబాబు**

హైదరాబాద్ , ప్రజాస్వరం
సమాజం పురుషాధిక్య ఆలోచనలతో నడుస్తోందని వాటినుంచి బయటకు రావాలని సినీ నటుడు నాగబాబు న్నారు. మహిళల డ్రెస్‌ల విషయంలో శివాజీ చేసిన కామెంట్స్‌పై ఆయన స్పందించారు. మోడ్రన్ దుస్తులు ధరించడం తప్పు కాదన్నారు. మహిళలపై జరుగుతోన్న లైంగికదాడులు వారి డ్రెస్‌ల వల్ల కాదని.. మగవాళ్ల క్రూరత్వం వల్ల అని నాగబాబు అన్నారు. ఈ అంశంపై తన అభిప్రాయాన్ని తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ వీడియో విడుదల చేశారు.

"నేను రాజకీయ నాయకుడిగానో, ఇండస్ట్రీకి చెందిన నటుడిగానో దీనిపై స్పందించడం లేదు.. ఒక సామాన్య వ్యక్తిగా దీని గురించి మాట్లాడుతున్నాను. అలాగని నేను శివాజీని టార్గెట్ చేయడం లేదు.. ఒకవేళ మీరు అలా అనుకుంటే నేనేం చేయలేను. ఆడపిల్లలు ఎలా ఉండాలి.. వాళ్లు ఎలాంటి దుస్తులు ధరించాలి.. ఏం మాట్లాడాలి.. ఏం మాట్లాడకూడదు అనే విషయాలపై ప్రతిఒక్కరూ ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానిస్తున్నారు. అలా కామెంట్స్ చేయడం రాజ్యాంగం ప్రకారం తప్పు. ఆడవాళ్లు ఇలాంటి డ్రెస్‌లు మాత్రమే వేసుకోవాలి అని చెప్పడానికి మీకేం హక్కు ఉంది. ప్రతి ఆడపిల్లకు ఆత్మగౌరవం ఉంటుంది. ప్రపంచంలో ఫ్యాషన్ అనేక రకాలుగా మారుతూ ఉంటుంది. ప్రతి ఆడపిల్లను కుటుంబసభ్యురాలిలానే చూడండి. మగవారితో సమానంగా బతికే హక్కు మహిళలకు కూడా ఉంటుంది" అని అన్నారు.

# హైదరాబాద్‌లో 15% నేలు తగ్గుముఖం

**సజ్జనార్ వార్షిక నివేదిక విడుదల**

**చట్టాన్ని ఎవరు ఉపేక్షించిన వారిపై కఠిన చర్యలు**

హైదరాబాద్, ప్రజాస్వరం



హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ వార్షిక నివేదికను విడుదల చేశారు. హైదరాబాదులో నేరాల సంఖ్య 15% తగినట్లు వెల్లడించారు. మహిళల పై నేరాలు, పోక్సో కేసుల సంఖ్య పెరిగాయని తెలిపారు. ఈ ఏడాది 30,690 ఎఫ్ఐఆర్ లు నమోదు కాగా గతేడాది 35,944 ఎఫ్ఐఆర్ లు నమోదు అయ్యాయని వెల్లడించారు. ఈ ఏడాది176 హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి.. 166 కిడ్నాప్ కేసులు 4536 చీటింగ్ కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది మహిళలపై జరిగిన నేరాలు ఆరు శాతం పెరిగాయి. అందులో 405 లైంగిక దాడి కేసులు, 119 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకూడదని.. చట్టాన్ని ఎవరు ఉపేక్షించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

హైదరాబాద్ పోలీసులు చాలా గట్టిగా యాక్షన్ తీసుకుంటున్నార న్నారు. పెట్రోలింగ్ మెరుగుగా చేయడం, నిఘా పెంచడంతో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే గ్యాంగులు కూడా తెలంగాణలోకి రావాలంటే భయపడుతున్నాయ న్నారు. నగరంలో ఎక్కడ దొంగతనం చేసిన పట్టు పడతామన్న భయం ఇతర రాష్ట్రాల్లో దొంగల్లో ఉంద న్నారు. .. సైబర్ క్రైమ్ పై అవేర్ నెస్ తీసుకు రావడంతో చాలా వరకు కేసుల సంఖ్య తగ్గాయని సీపీ తెలిపారు. సోషల్ మీడియాలో అన్ని నేరాలపై అవేర్ నెస్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామ ని, సైబర్ క్రైమ్ టీమ్ లు మెరుగ్గా పనిచేశారని, ఈ ఏడాది 566 మంది సైబర్ నేరస్తులని అరెస్టు చేశామన్నారు.

ప్రతి మంగళవారం, శనివారం ప్రజల్లోకి వెళ్లి అవేర్ నెస్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామ న్నారు.. హైదరాబాద్ వాసుల నుంచిమంచి స్పందన వ స్తుంద న్నారు.. అత్యాశకు హద్దు ఉండదు అందులో భాగంగానే కొంతమంది సైబర్ నేరస్తుల బారిన పడుతున్నారన్నారు.. డబ్బులు ఊరికే రావు అనేది ప్రజలందరూ గుర్తుంచుకోవాలన్నారు.. ఎవరు కూడా సైబర్ నేరస్తుల బారిన పడి బలి కావద్దు అని సూచించారు. 120 అకౌంట్లను సీజ్ చేశామన్నారు. డ్రగ్ ఫ్రీ సొసైటీ కోసం తెలంగాణ ప్రభుత్వం గోల్ పెట్టుకుంద న్నారు. ఆ గోల్ కు తగ్గట్టుగా హైదరాబాద్ పోలీసులు నార్కోటిక్స్ టాప్ ప్రయారిటీగా పెట్టుకొని పని చేస్తున్నామ న్నారు.. ఈ ఏడాది 368 డ్రగ్స్ కేసులు నమోదు అయ్యాయని, ఆరున్నర కోట్ల రూపాయల డ్రగ్స్ ని సీజ్ చేశామన్నారు. రాబోయే రోజుల్లో టీంల సంఖ్యను పెంచుతామని తెలిపారు. డ్రగ్స్ సప్లై చేసే నెట్ వర్క్ నిషేధించేందుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నామ న్నారు. డ్రగ్స్ కు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ఉక్కు పాదం మోపపోతున్నామ న్నారు... పట్టుకున్న వారికి తగిన శిక్ష పడేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామ న్నారు.

రాబోయే రోజుల్లో ఎన్ డీపీఎస్ వింగ్ ఏర్పాటు చేసి డీసీపీ స్థాయి అధికారిని పెట్టబోతున్నామ న్నారు. ఈ ఏడాది 4463 మందికి శిక్షపడేలాగా చేశామన్నారు. ట్రాఫిక్ మేనేజ్మెంట్ నగర వాసులకు పెద్ద సమస్యగా మారిందని, ఈ ఏడాది రోడ్డు యాక్సిడెంట్ చాలావరకు తగ్గాయ ని, డ్రంక్ అండ్ డ్రైవ్ పై చాలాకాలంగా అవేర్ నెస్ చేస్తూ వస్తున్నామ న్నారు. 49732 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయ న్నారు. న్యూ ఇయర్ సందర్భంగా 126 ప్రత్యేక టీం లు పనిచేయబోతున్నాయని సజ్జనార్ వెల్లడించారు. న్యూ ఇయర్ రోజు తాగి వాహనాలు నడపొద్దని కోరుతున్నామ న్నారు. హైదరాబాద్ వాసులు పోలీసులకు అన్ని విధాలుగా సహకరిస్తున్నారన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకుండా సహకరించాలని సీపీ కోరారు.

# పేట్రేగిపోయిన ఏటీఎం దొంగలు

**రూ.50 లక్షల నగదు కాలి బూడిద**

**వర్ని చౌరస్తా, వినాయక నగర్ .. ఏటీఎంల ధ్వంసం**

నిజామాబాద్,ప్రజాస్వరం
నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏటీఎం దొంగలు రెచ్చిపోయారు. గంటల వ్యవధిలో రెండు ఏటిఎం లలో చోరీకి యత్నించారు. యంత్రాలు తెరుచుకోకపోవడం తో దుండగులు తగులబెట్టారు. దీంతో రూ.50 లక్షల నగదు కాలి బూడిదైంది. వర్ని చౌరస్తా, వినాయక నగర్ లోని ఏటీఎంలను ధ్వంసం చేశారు. బైక్ పై ఇద్దరు దొంగలు ఏటీఎంలోకి చొరబడగా.. కారులో మరో ఇద్దరు రెక్కీ నిర్వహించారు. సీసీ కెమెరాలో దొంగల దృశ్యాలు రికార్డయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

